# ఫ్యూర్జ్వి

కథల సంపుటి



పొత్తూరి విజయలక్ష్మి

## కథాక్రమం


| | |
|---|---|
| 1. పూర్వి | 1 |
| 2. బాలరాజు కథ | 12 |
| 3. ఆనాటి ముచ్చట్లు | 21 |
| 4. సుఖాంతం | 28 |
| 5. ఇంకా మారాలి | 41 |
| 6. పుణ్యాత్మురాలు | 49 |
| 7. ఒక ప్రయాణం | 57 |
| 8. చల్లని దీవెన | 64 |
| 9. ఆడవారికి ఆవేశం వస్తే | 72 |
| 10. ఎవరో ఒకరు ఎపుడో అపుడు | 81 |
| 11. సీతారాములు కోతులు | 88 |
| 12. బ్లాగుతో కథ సుఖాంతం | 95 |
| 13. ఈశ్వరానుగ్రహం | 102 |
| 14. ప్రేమికుల రోజు | 113 |
| 15. కొత్త కోణం | 121 |
| 16. శ్రీదేవమ్మగారి మామిడితోరణం | 124 |

# పూర్వి

సాయంత్రం ఏడుగంటలు అయింది. జ్యేష్ఠమాసం ఉబ్బరించేస్తోంది. జీర్ణావస్థలో వున్న పెంకుటింట్లో ఓ భాగంలో గోడకానుకుని కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు గోపాలం, సావిత్రి. గేటు కిర్రుమంటూ చప్పుడు చేసింది.

“ఇంత చీకటి పడ్డాక ఇప్పుడెవరు వస్తారు మనింటికి?” అంది సావిత్రి.

నవ్వేశాడాయన. “చీకటి పడ్డాక అయినా, వెలుతురుండగానే అయినా మనింటికి వచ్చేది ఒకే ఒక వ్యక్తి బలరామ్” అన్నాడు.

ఆయన అంచనా నిజమే. బలరామ్ వచ్చాడు. అయితే అలవాటుకి విరుద్ధంగా ఒక అమ్మాయిని వెంటబెట్టుకొచ్చాడు.

“బావా? ఏం చేస్తున్నావ్? భోజనాలయ్యాయా?” పలకరిస్తూ వాళ్ళెదురుగానే నేలమీదే కూర్చున్నాడు.

“లేదురా! ఈ అమ్మాయి ఎవరూ?” ఆ అపరిచితురాలిని పరిశీలనగా చూస్తూ అడిగాడు గోపాలం.

ఇరవై పాతిక మధ్య వుంటుంది. నైలాన్ పంజాబీ డ్రెస్ వేసుకుంది. ఈ ప్రాంతం మనిషిలా లేదు.

“ఈ అమ్మాయి పేరు పూర్వి. పశ్చిమబెంగాల్‌లో మారుమూల ప్రాంతంలో ఉంటుంది” పరిచయం చేశాడు. ఆ అమ్మాయి వీరిద్దరికీ నమస్కారం చేసింది. ఆశీర్వదించారు వాళ్ళు.

“అంత దూరం నుంచి వచ్చిందా? ఎందుకు?” అర్థం కాలేదాయనకి.

“ఏదో విషయం మీద పరిశోధన చేస్తోందిట. మన ఊళ్ళోని ఆలయంలో ఏవో రహస్యాలు వున్నాయని తెలిసిందట. అందుకోసం వచ్చింది” చెప్పాడు బలరామ్.

ఫక్కున నవ్వాడు గోపాలం. కొరబోయింది. ఈ ఊళ్ళో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో మూలవిరాట్టుకే ధూపదీప నైవేద్యాలు జరగడం గగనంగా వుంది. ఊళ్ళోని వాళ్ళంతా పట్టణాలకు వలస పోయారు. ఊరే శిథిలావస్థకు చేరుకుంది. అటువంటి గుళ్ళో రహస్యాలు? వాటి మీద పరిశోధనలూనూ??

ఆ మాటే అంటే బలరామ్ చిన్నగా నవ్వేడు. “ఏమో మరి? మనలాంటి వాళ్ళకు తెలియని రహస్యాలు ఏమైనా వున్నాయేమో? అంత దూరం నుంచి వచ్చింది. నాల్రోజులు

వుంటుందిట. మా ఇంట్లో పరిస్థితి నీకు తెలుసుగా? పిల్లలొచ్చారు. ఇల్లు ఇరుగ్గా వుంది. అందుకే ఇక్కడికి తీసుకువచ్చాను. మీకేం ఇబ్బంది కాదుగా?" అన్నాడు.

"ఆడపిల్ల, అంత దూరం నుండి వెతుక్కుంటూ వస్తే ఆ మాత్రం ఆశ్రయం ఇవ్వలేమా? మాతో పాటే గుప్పెడు తింటుంది" అన్నాడు.

"అయితే వెళ్ళొస్తా. మళ్ళీ రేపు పొద్దున్నే వస్తా" అని చెప్పి వెళ్ళిపోయాడు బలరామ్. ఆ అతిథితో మాట్లాడాలని ప్రయత్నించింది సావిత్రి. కానీ భాష రాదు. అంతా సైగలే. అన్నం తినమంటే వద్దు తినేశాను అంది. సరే పోనీ ప్రసాదం తిను అని రెండు అరటి పళ్ళు ఇస్తే భక్తిగా అందుకుని కళ్ళకు అద్దుకుని తిన్నది. చాప ఇస్తే వసారాలో పరుచుకుని పడుకుంది.

తెల్లవారి మామూలుగానే లేచింది సావిత్రి. వసారాలోకి చూస్తూ ఖాళీగా ఉంది ఆ చోటు. నిద్ర లేచిందేమో కొత్త చోటు స్నానాలగది చూపించాలి అనుకుంటూ దొడ్డి తలుపు తీద్దామని వెళ్ళిన సావిత్రికి అడుగు ముందుకి పడలేదు. పెరడంతా అద్దంలా చిమ్మి వుంది.

నీళ్ళ తొట్టె దగ్గర కూర్చుని పూజకి వాడే ఇత్తడి సామాన్లు తోముతోంది పూర్వి. స్నానం కూడా అయిపోయినట్టుంది. సావిత్రిని చూడగానే లేచి నిలబడి నమస్కారం చేసింది చిరునవ్వుతో.

సావిత్రి కంగారు పడిపోయింది. కొత్తగా వచ్చిన పిల్ల అలా పనులు చేస్తుంటే ఆవిడకి చాలా మొహమాటం వేసింది. గభాల్న వెళ్ళి ఆ అమ్మాయి చేతుల్లోంచి ఆ పని అందుకోవాలని ప్రయత్నించింది. పూర్వి అడ్డం పడింది. "నేను చేస్తాను, మీరు వేరే పని చూసుకోండి" అంది.

ఇంట్లోకొచ్చింది సావిత్రి. గోపాలం కూడా నిద్ర లేచాడు. "చూశారా ఆ అమ్మాయిని, మరి ఎప్పుడు నిద్ర లేచిందోగాని ఎంత పని చేసేసిందో?" అంటూ అంతా వివరించింది.

"నేను కాఫీ పెడతాను. ఆ అమ్మాయి హిందీ పిల్ల కదా! టీ తాగుతుందేమో. బండి దగ్గరికెళ్ళి టీ పోయించుకురండి. ఆ చేత్తోనే నాలుగు ఇడ్లీలు పట్టుకురండి. నిన్న రాత్రి అన్నం కూడా తినలేదా అమ్మాయి. ఆకలి వెయ్యదా పాపం" అని ఆయన్ని కంగారు పెట్టేసింది.

కాఫీ తయారయ్యేసరికి ఆయన టీ, ఇడ్లీలు పట్టుకొచ్చాడు. పూర్విని పిలుద్దామని దొడ్లోకి వెళ్తుంటే గుమ్మం దగ్గరే ఎదురుపడింది. చేతుల్లో పూలు. నిర్ఘాంతపోయింది సావిత్రి.

పెద్ద ఇత్తడి పళ్ళెంలో పారిజాతాలు, తులసీదళాలు, పచ్చగన్నేరు పూలు నాలుగు కుప్పలుగా పోసి ఉన్నాయి. కంచుగిన్నె నిండా మందారాలు, ఇంకా చిన్న ఇత్తడి పళ్ళెం

నిండా నందివర్ధనాలు. ఆ పిల్ల పనిమంతురాలు అని ఇందాకే అర్థమయింది. అటువంటి వ్యక్తి పువ్వులు కోసిందంటే అందులో వింత ఏమీ లేదు. కాని ఆ పువ్వులకి వాడిన పాత్రలు, ఆ అమరిక. ఆ ఇంట్లో ఎన్నో ఏళ్ళుగా పువ్వులు కోసి ఆ పాత్రలలో అదేవిధంగా సర్దడం అలవాటు. అది ఈ వ్యక్తికి ఎలా తెలుసు? ఏదో కాకతాళీయంగా జరిగిందా? అంతా అయోమయంగా అనిపించింది.

తల విదుల్చుకుని గ్లాసులో టీ పోసి పూర్వికి అందించింది. టీ గ్లాసు అందుకుని వంటిల్లు దాటి మధ్యగది దాటి ముందు వసారాలో కూర్చుని టీ తాగడం మొదలుపెట్టింది పూర్వి. సావిత్రి మళ్ళీ ఆశ్చర్యపోయింది. కింద ఇంట్లో కాఫీ, పలహారాల తయారు వరకే పరిమితం. అక్కడ ఎవరూ ఏమీ తినరు, తాగరు. ఎందుకంటే అది పూజారిగారిల్లు. అక్కడ గుళ్ళోని దేవుడికి మహానైవేద్యం వండుతారు. కాబట్టి చాలా శుచిగా ఉండాలి. ఇంటివారికి అవి అలవాటే. మరి ఈ అతిథికి ఎలా తెలుసు? ఎంతో కాలంగా ఈ ఇంట్లో వున్న మనిషిలాగా కొత్త వ్యక్తి ఎలా ప్రవర్తించగలుగుతోంది. సావిత్రి మనసులో ఏదో అనుమానం రేకెత్తింది.

వసారాలో స్తంభానికి ఆనుకుని కూర్చుని టీ తాగుతూ వున్న పూర్వి మనసు అల్లకల్లోలంగా వుంది. తుఫాను రాబోతుంది అని తెలిసిన మనిషికి దాన్ని ఎలా ఎదుర్కోవాలా అని కలిగే అలజడి అది.

గోపాలం స్నానం ముగించాడు. గుడికి వెళ్ళడానికి సిద్ధమై పూర్వి దగ్గరకు వచ్చాడు. "గుడికి వెళ్తున్నాను. నువ్వు వస్తావా? ఏదో పనుందన్నావు కదా అక్కడ?" అన్నాడు. భాష అర్థం కాకపోయినా ఆయన గుడికి వెళ్తున్నాడని అర్థం అయింది. నడుముకి బిగించి కట్టుకున్న చున్నీ విప్పి సరిగా వేసుకుని కాళ్ళకి చెప్పులు కూడా లేకుండా వెంట నడిచింది.

వేణుగోపాలస్వామి ఆలయం కుడిపక్క పెద్ద వేపచెట్టు. ఎడమవైపు రావిచెట్టు. ఎన్నోసార్లు వినీ వినీ వుండడం వలన అంతా పరిచయం వున్నట్టుగానే అనిపించింది. ప్రదక్షిణం చేసి దేవుడి ఎదురుగా కూర్చుంది. గోపాలం నిత్య పూజలో నిమగ్నుడై పోయాడు.

మౌనంగా దేవుడిని ప్రార్థిస్తూ వుండిపోయింది పూర్వి. పూజ అయిపోయింది. గోపాలం కూడా వాకిలి దగ్గర కూర్చున్నాడు. అదివరకూ విరివిగా భక్తులు వచ్చేవాళ్ళు. ప్రస్తుతం ఒకరో ఇద్దరో వస్తే గొప్ప.

ప్రతీరోజూ ఉదయం గుడి తెరిచి పూజ చేస్తాడు. పదిన్నరకి నైవేద్యం వండి పట్టుకొస్తుంది సావిత్రి. నివేదన చేసి హారతి, మంత్రపుష్పం వగైరా కార్యక్రమాలు ముగించి గుడికి తాళం పెట్టి వెళ్ళిపోతాడు. అదే నిత్యకృత్యం. ఆ వేళా అలాగే జరిగింది. కాకపోతే వాళ్ళిద్దరితో పాటు, మరో వ్యక్తి అదనంగా వుంది.

ముగ్గురూ కలిసి ఇంటికొచ్చారు. ఇంటి తలుపు తీస్తుండగానే ఇంటి ముందు

ఆటో ఆగింది. అందులోంచి బలరామ్ దిగాడు. అతని వెనకాలే సుధ, రామ్మోహన్ కూడా దిగేరు.

అనుకోకుండా వచ్చిన కూతుర్ని, అల్లుడినీ చూసి ఆశ్చర్యపోయారు గోపాలం, సావిత్రి. "అదేమిటే ఫోనూ లేదు, ఏమీ లేదు. ఇంత హఠాత్తుగా వచ్చావేం?" ముక్తకంఠంతో అడిగారు.

ఆశ్చర్యపోవడం సుధ, రామ్మోహన్‌ల వంతు అయింది. "అదేమిటి? వున్నపాటున రమ్మని బలరామ్ మామయ్యని తెల్లారకుండా పంపించారు కదా? ఏమిటా అని కంగారు పడుతూ వచ్చాం" అన్నారు ఇద్దరూ ముక్తకంఠంతో. పూర్వి వాళ్ళిద్దరికి వంకా ఆప్యాయంగా చూస్తోంది.

అందరూ బలరామ్ వంక చూశారు. "ఏమిటిదంతా?" అడిగాడు గోపాలం. "చెప్తాను. ముందు లోపలికి వెళ్దాం" అన్నాడు.

అంతా లోపలికి వెళ్ళారు. "చెప్పు మామయ్యా! మాకు కంగారుగా వుంది" అంది సుధ. మెల్లిగా కంఠం విప్పాడు బలరామ్. "ఈ అమ్మాయి మన హరి భార్య" అన్నాడు మెల్లిగా.

అదిరిపడ్డారు శ్రోతలు. హరి.... ప్రస్తుతం ఒక జ్ఞాపకార్థంగా మిగిలిపోయిన హరి గోపాలం కొడుకు. వాళ్ళకి ప్రథమ సంతానం కూతురు సుధ. ఆ తర్వాత ఆరేళ్ళకి ఎన్నో మొక్కులు మొక్కగా కలిగిన వంశోద్ధారకుడు. లేక లేక కలిగిన కొడుకని చాలా గారాబంగా పెంచారు. ఆ గారాబమే హరి పాలిట శాపం అయింది.

చదువు వంటపట్టలేదు. దానికి సాయం చెడు అలవాట్లు. వయసు పెరుగుతున్నకొద్దీ మొండితనం కూడా పెరిగింది. ఏకు మేకై కూర్చున్నాడు. చెడు సావాసాలు, జులాయిలా తయారయ్యాడు. చేజారిపోతున్న కొడుకుని చూసి తల్లిదండ్రులు పడిన బాధ అంతా ఇంతా కాదు. ఆ రోజుల్లోనే సుధకి పెళ్ళయింది. అల్లుడు రామ్మోహన్‌కి చిన్న షాపు వుంది. కరెంటు పరికరాలు రిపేర్లు చేస్తాడు.

అమ్మా నాన్న దగ్గరే ఉంటే మరీ చెడిపోతాడని బావ దగ్గర పెడితే కాస్త భయపడి దారికొస్తాడేమోనని ఆశతో తనతో తీసుకువెళ్ళింది సుధ. అప్పటికే భయపడి బాగుపడే స్థితి దాటిపోయిన హరి ఒకరోజున ఇంట్లోనుంచి పారిపోయాడు. ఉట్టినే వెళ్ళకుండా పెట్టెలోనించి అక్క బంగారం గొలుసు దొంగతనం చేసి మరీ పోయాడు.

హరి కోసం చాలా రోజులు వెతికారు. పేపర్లలో వేయించారు. ఫలితం శూన్యం. కొడుకు కోసం ఏడ్చారు. మొత్తుకున్నారు. క్రమంగా ఆ సంఘటన పాతబడిపోయింది. ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు దుఃఖించడం తప్పించి వారి జీవితాల నుండి హరి నిష్క్రమించాడు.

మళ్ళీ ఇన్ని సంవత్సరాల తరువాత గాయం రేపినట్టు హరి ప్రసక్తి వచ్చింది. ఒక కొత్త మనిషి ఏదో సాకున ఇంటికొచ్చింది. ఆ మనిషి హరి భార్య. అదే నిజమైతే మరి హరి ఏడి? ఏం మాట్లాడాలన్నా భాష సమస్య వుండనే వుంది.

రామ్మోహన్‌కి హిందీ చక్కగా వచ్చు. సుధకి కూడా హిందీ అర్థం అవుతుంది. అందుకే వాళ్ళని వెంటబెట్టుకొచ్చాడు బలరామ్.

హరి గురించి ఇక పూర్వి చెప్పాలి. వాళ్ళకి తెలియాలి. చెప్పడానికే వచ్చింది. కాబట్టి అవకాశం దొరకగానే చెప్పడం మొదలుపెట్టింది.

***

పూర్వి డార్జిలింగ్‌లో ఉంటుంది. చిన్నతనంలోనే తల్లీదండ్రీ పోతే నాయనమ్మ పెంచి పెద్ద చేసింది. ఆ తర్వాత ఆవిడా పోయింది. పూర్వి ఒంటరిగానే జీవిస్తోంది. ఇంట్లోనే చిన్న హోటల్ నడుపుతుంది. నూడుల్స్, మోమోలు చేసి అమ్ముతుంది. టీ చాలా బాగా చేస్తుంది.

సీజన్లో టూరిస్ట్‌లు విపరీతంగా వస్తారు డార్జిలింగ్‌కి. అప్పుడు చాలా బాగా జరుగుతుంది వ్యాపారం. అప్పుడు దాచుకున్న డబ్బుతో మిగిలిన రోజులు కాలక్షేపం. ఏడాదిలో వేసవికాలం నేల ఈనినట్టు వుంటారు టూరిస్ట్‌లు. దసరాలప్పుడూ చాలామందే వస్తారు. బాగా చలిగా వున్నప్పుడు ఎవరూ రారు.

ఆ ఏడాది దసరా రద్దీ తగ్గింది. దీపావళి వెళ్ళిపోయింది. చలికాలం ప్రారంభం అవుతుంది. రాత్రి ఎనిమిది గంటలు అవుతూ వుండగా ఒక మనిషి పూర్వి హోటల్‌కి వచ్చాడు. హోటల్ మూసివేసే ప్రయత్నంలో వుంది పూర్వి. తయారు చేసిన కాస్త సరుకులు అడుగూ, బొడుగూ మిగిలుంది. ఒక్క మనిషి కోసం టీ పెట్టాలన్నా బద్ధకం వేసింది. అందుకే హోటల్ బంద్ అయిపోయింది, ఇంకో చోటికి పొమ్మంది.

"నేను తినడానికి రాలేదు. ఏదైనా పని దొరుకుతుందేమో అని వచ్చాను" అన్నాడు. చిరాకు పడింది పూర్వి. "నాకే పని లేక ఏడుస్తున్నాను. ఇంకా నీకేం పని ఇస్తాను వెళ్ళిరా" అంది.

"నువ్వు ఈ ఊళ్ళోదానివే కదా! నాకు ఎక్కడైనా పని చూపిస్తావా? ఇప్పటికి ఇప్పుడని అడగడం లేదు. మెల్లిగానే చూడు. పది మందితో చెప్తే, ఒక్కరైనా సహాయం చేయకపోతారా అనే ఆశ" అన్నాడు.

అతనివంక చూసింది. ఆ మొహంలో నీరసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"ఏమైనా తింటావా?" అని అడిగింది. క్షణం ఆలస్యం చెయ్యకుండా తలూపాడు. మిగిలిపోయిన నూడుల్స్, మోమోలు పెట్టింది. ఆవురావురుమంటూ తిన్నాడు. "నా దగ్గర

డబ్బుల్లేవు" అన్నాడు మొహమాటంగా. "డబ్బులేం వద్దు. మిగిలినవే పెట్టాను" అంది.

"అయితే ఏదైనా పని చెప్పు" అన్నాడు. "పని కూడా ఏమీ లేదు" అంది.

అయినా కల్పించుకుని హోటల్ సర్ది శుభ్రం చెయ్యడంలో పూర్వికి సాయం చేశాడు. "వెళ్తాను. నా సంగతి మర్చిపోకు. ఏదైనా పని చూడు" అని మరొకమారు చెప్పి వెళ్ళిపోయాడు.

అది మొదలు రెండు మూడు రోజులకి ఒకసారి వస్తూ వుండేవాడు. తన గురించిన వివరాలు చెప్పాడు. పేరు హరి, ఇంట్లోంచి పారిపోయి కలకత్తా చేరాడు. అక్కడ ఏవో కొన్ని పనులు చేసుకుంటూ కొంతకాలం గడిపాడు. ఒక కాంప్లెక్స్‌లో కార్లు శుభ్రం చేసే పని దొరికింది. ఆ పనిలో వుండగానే మరో అవకాశం వచ్చింది.

కలకత్తాలో ఒక పెద్దాయనకి డార్జిలింగ్‌లో చిన్న ఇల్లు వుంది. ప్రతీ ఏడూ వేసవికాలం మూడు నెలలు డార్జిలింగ్ వెళ్ళి ఉంటాడు. అక్కడ వున్నప్పుడు నీళ్ళు తేవడానికీ, ఇతర పనులు చెయ్యడానికి ఓ మనిషిని తీసుకెళ్తాడు. అలా వెతుకుతుంటే హరి ఆయన కంటపడ్డాడు. మద్రాసీవాడు, కష్టపడి పనిచేస్తాడు. అందుకే వెంట తీసుకెళ్ళాడు. ఆయన నమ్మకంతో తీసుకువెళ్ళినందుకు శ్రద్ధగా పని చేశాదు హరి. మూడు నెలలు గడిచాయి. హరికి డార్జిలింగ్ నచ్చింది. ఇక్కడ పనిచేసుకుంటూ వుండిపోదాం అనుకున్నాడు. వాళ్ళు వెళ్ళిపోయారు.

అక్కడా ఇక్కడా పనులు చేసుకుంటూ హమ్మయ్య అనుకున్నాడు. కాని సీజన్ అయిపోయాక పని దొరకడం కష్టం అయిపోయింది. నాలుగు రోజులకి ఒకరోజు పని దొరికితే మిగిలిన రోజులు ఖాళీ. పోనీ మళ్ళీ కలకత్తా వెళ్ళిపోదామా అనుకుంటూ వుండగా జ్వరం వచ్చి పడక వేశాడు. అది తగ్గేసరికి మళ్ళీ దసరా సీజన్ వచ్చింది. ముమ్మురంగా పనులు దొరికాయి. మళ్ళీ వేసవి దాకా ఎలాగో గడిపేసి అప్పుడు సంపాదించుకున్న డబ్బులు కొంత దాచుకుంటే పని చేయనప్పుడు గడిచిపోతుంది అనుకున్నాడు. అక్కడే వుండాలనుకున్నాడు. ఆ రోజుల్లోనే పూర్వి దగ్గరకి రావడం జరిగింది.

ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. తను సంపాదించిన డబ్బు పూర్వి దగ్గర దాచుకోవడం, పని లేనప్పుడు పూర్వి దగ్గరికి వచ్చి తోచిన సహాయం చెయ్యడం అలవాటయ్యాయి. పూర్వికి కూడా హరి పట్ల మంచి అభిప్రాయం కలిగింది. మంచివాడు, స్నేహంగా వుంటాడే తప్పించి వెర్రి మొర్రి వేషాలు వెయ్యడు. అలాగే ఓ సంవత్సరం గడిచింది.

హరికి ఒక టీ ఎస్టేట్‌లో పర్మనెంటు ఉద్యోగం దొరికింది. చిన్న ఉద్యోగమే, అయినా స్థిరంగా వుంటుంది. పూటపూటకీ వెతుక్కునే అవసరం వుండదు. ఉద్యోగం రాగానే పరుగున వచ్చి పూర్వికి ఆ శుభవార్త చెప్పాడు. ఎంతో సంతోషించింది పూర్వి.

ఉద్యోగంలో చేరినా పూర్వి దగ్గరకు రావడం మాత్రం మానలేదు. పీక్ సీజన్‌లో పూర్వికి ఊపిరి సలపనట్టున్నప్పుడు వచ్చి రాత్రి పొద్దు పోయేదాకా వుండి సాయం చేసేవాడు.

ఒకరోజు సాయంత్రం వచ్చాడు పూర్వి దగ్గరికి. "నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నాడు. ఏమిటో చెప్పమంది. "నాకు నేను పని చేసే చోట కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్న ఇల్లు ఇచ్చారు. నాకు, నా కుటుంబానికి వైద్య సదుపాయమూ, ఇంకా కొన్ని అలవెన్సులూ ఇస్తారుట. ఫారం నింపి ఇమ్మన్నారు. నీకు అభ్యంతరం లేకపోతే నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాడు.

హఠాత్తుగా అతను అలా అడిగేసరికి తెల్లబోయింది పూర్వి. "నీకీ ఆలోచన ఎలా వచ్చింది? మనిద్దరికీ స్నేహమే తప్ప మరో భావన లేదు కదా?" అని అడిగింది.

"అవును. ఇంతకాలం ఆ ఆలోచనే లేదు. ఇప్పుడు ఒక అవకాశం వచ్చింది. నన్ను పెళ్ళి చేసుకుంటే నీకూ కొంత మంచి జరుగుతుంది. నేను కష్టాల్లో ఉన్నప్పుడు నువ్వు నాకు సాయం చేశావు. ఇప్పుడు నీకు సాయం చేసే అవకాశం నాకు వుంది. పెళ్ళి కాలేదు అని రాసేసే బదులు నా భార్యగా నీ పేరు నమోదు చేస్తే బాగుంటుందని నాకు అనిపించింది. ఇందులో బలవంతం ఏమీ లేదు. ఆలోచించుకుని చెప్పు" అన్నాడు.

ఆలోచించింది పూర్వి. బొత్తిగా తాడూ బొంగరం లేని జీవితం తనది. ఒంటరిగా వుంది. కష్టపడి నాలుగు రూపాయలు సంపాదించుకుంటోంది. పెళ్ళి చేసుకుంటాం అని గతంలో రెండు మూడుసార్లు ఎవరో అడిగారు. వాళ్ళని చేసుకుంటే మెడకి గుదిబండ తగిలించుకున్నట్టే. తన సంపాదన మీద ఆధారపడేవాళ్ళే తప్పించి తనకు అండగా నిలబడే వాళ్ళెవరూ ముందుకి రాలేదు.

ఇప్పుడు హరి ముందుకొచ్చాడు. మంచివాడు, కష్టజీవి. ఏ వ్యసనాలు లేవు. ఇంతకంటే మంచి జీవిత భాగస్వామి లభించడం అసంభవం. రెండు దండలూ, ఒక సిందూరం డబ్బా, పావుకిలో మిఠాయి. పూజారికి దక్షిణ ఖర్చు. అంతా కలిపి రెండొందల లోపే.

పెళ్ళి చేసుకుని గుళ్ళోంచి బయటకొచ్చి ఆవరణలో కూర్చుని పసిపిల్లాడిలా ఏడ్చాడు హరి. కంగారు పడిపోయింది పూర్వి. "ఇంత దుఃఖపడుతూ వుండడం నేనెప్పుడూ చూడలేదు. ఏమైంది?" అని అడిగితే చెప్పాడు.

"నాకు అమ్మా నాన్నా గుర్తొస్తున్నారు. అక్క గుర్తొస్తోంది." అన్నాడు. ఆశ్చర్యపోయింది పూర్వి. తనలాగే అతనికీ ఎవరూ లేరనే అనుకుంది. అందరూ వున్నారు అని అప్పుడే తెలిసింది. "నీకు అమ్మా నాన్నా వున్నారా? వాళ్ళు ఎక్కడున్నారు? నువ్వెందుకు ఒంటరిగా వుంటున్నావు?" అని ప్రశ్నల వర్షం కురిపించింది.

చిన్నతనం నుంచీ ఎలా అల్లరిచిల్లరిగా వుండేవాడో చెప్పాడు. తన జీవితం

బాగుపరచాలనే ఆశతో తీసుకెళ్ళిన అక్క కళ్ళుగప్పి గొలుసు తీసుకుని పారిపోవడం, ఆ గొలుసు అమ్మి ఆ డబ్బుతో హైదరాబాద్‌కెళ్ళి సినిమాల్లో చేరాలనుకోవటం, ఎవరో రౌడీలు తన్ని ఆ నగలు తీసుకెళ్ళిపోవడం, ఆ తర్వాత హతాశుడై రైలు స్టేషన్లలో అడుక్కు తింటూ అంచెలంచెలుగా కలకత్తా చేరడం అన్నీ చెప్పాడు. ఆ తరువాతి కథ పూర్వికి తెలిసిందే.

పెళ్ళి తరువాత పూర్వి హోటల్ యథాప్రకారం నడుస్తూనే ఉంది. అదివరకులా కాకుండా హరి పూర్వితో మనసు విప్పి మాట్లాడడం ప్రారంభించాడు. ఆ మాటల సారాంశం తన బాల్యం, తన ఇల్లు, తనవాళ్ళూ అన్నీ వివరంగా ఒకటికి పదిసార్లు కళ్ళకి కట్టినట్టుగా.

మొదట్లో కాస్త విసుగ్గా అనిపించినా – తనకంటూ ఎవరూ లేని పూర్వి – భర్త జ్ఞాపకాలతో మమేకం అయిపోయింది. ఆ ఇల్లు తనదిగా అనిపించింది. ఆ మనుషులు తనవాళ్ళు అనిపించారు.

చిన్నతనంలో బుద్ధి గడ్డి తిని వాళ్ళని చాలా బాధపెట్టాను. ఇంట్లోంచి పారిపోయి వచ్చాకగానీ ఇంటి విలువ, అమ్మానాన్నల విలువ తెలిసిరాలేదు. అప్పుడు తిరిగి వెళ్ళాలని అనిపించినా భయం వేసింది. ఇప్పుడు నాకు వాళ్ళు ఎంతగానో గుర్తొస్తున్నారు. అందర్నీ చూడాలనిపిస్తోంది. కాని అది అసాధ్యం. ఊరికి వెళ్ళాలంటే మాటలా? దారి ఖర్చులకే బోలెడంత అవుతుంది. ఇంతకాలం కూటికీ గతి లేదు. ఇప్పుడు ఓ ఉద్యోగం అంటూ వచ్చింది. డబ్బు కూడబెట్టుకొని వెళ్ళి రావాలి అని తపన పడిపోయేవాడు. అదివరకులాగా కటకట లాడకపోయినా అతనికి వచ్చే జీతంలో ఖర్చులకు పోగా మిగలడం అంత తేలికేం కాదు. ఒక నెల వంద రూపాయలు మిగిలితే మహదానందపడిపోయేవాడు. ఇలా మిగిలితే ఇంకా రెండేళ్ళ తర్వాతనైనా ఇంటికెళ్ళగలను అనుకునేవాడు. మరుసటి నెలలో పైసా మిగలకపోతే కుంగిపోయేవాడు.

అలా పది నెలలు గడిచాయి. ఒక రోజు ఆఫీసర్లతో జీపులో ప్రయాణం చేస్తూ వుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో జీపు ముందు చక్రం లోయలోకి జారింది. వెనక కూర్చున్న హరి గభాల్న దూకి ముందుకి పరిగెట్టి జీప్‌ని ఆపేడు. అందులో వున్న వాళ్ళంతా దిగారు. కానీ హరి, డ్రైవరు మాత్రం లోయలోకి జారిపోయారు జీప్‌తో సహా! మర్నాడు బయటకి తీశారు శవాలను!

***

శూన్యంలోకి చూస్తూ ఏదో కథ చెప్పినట్లు చెప్తూ వున్న పూర్వి మాటలు వింటూ వున్న రామ్మోహన్, సుధ కెవ్వుమని అరిచారు.

పూర్వి చెపుతూ వుండగానే మధ్య మధ్యలో ఆపి 'సుధా, ఏమిటీ ఏమంటోంది ఈ అమ్మాయి?' అని అడుగుతూనే వుంది సావిత్రి. చివరలో ఏక్సిడెంటూ, జీప్, హరి, డెడ్ బాడీ అనే పదాలు విని కీడు శంకించింది. "ఏమిటే సుధా! ఏమయిందే?" అంటూ గోల పెట్టేసింది. చెప్పలేక చెప్పలేక చెప్పేశాడు రామ్మోహన్.

అయిపోయింది. కంటికి దూరమైపోయిన కొడుకు ఎక్కడున్నాడో అనే ఆరాటం, ఎక్కడో అక్కడ సుఖంగా వుండాలన్న ప్రార్థనలూ, దూరమైనట్టే ఏదో ఒకరోజు మళ్ళీ కంటికి కనిపిస్తాడేమో అనే ఆశలన్నీ ఆవిరైపోయాయి.

క్షణాల మీద పాకిపోయిందా వార్త. ఊళ్ళో వున్న కొద్దిమందీ వచ్చి పరామర్శించారు. ఆ రోజంతా ఏడుస్తూనే వున్నారు ఇంట్లోవాళ్ళు. మరునాటికి కాస్త తేరుకున్నారు. జరగవలసిన కార్యక్రమాలు జరిపేశాడు గోపాలం. అంత దూరం నుండీ పడుతూ లేస్తూ ఎందుకొచ్చిందీ అమ్మాయి. ఈ కబురు ఉత్తరం ద్వారా తెలియజేస్తే సరిపోయేదిగా! అందరి మనసులలోనూ అదే ప్రశ్న. ఆ మాటే అడిగాడు రామ్మోహన్. నిట్టూర్చింది పూర్వి. ఇక్కడికి రావడానికి బలమైన కారణమే వుంది.

హరి డ్యూటీలో వున్నప్పుడు ప్రమాదవశాత్తు చనిపోయాడు. పోయేముందు నలుగురు ఆఫీసర్ల ప్రాణాలు కాపాడి మరీ పోయాడు కాబట్టి సానుభూతిగా అతని భార్యకు ఉద్యోగం ఇచ్చారు. రెండు లక్షలు నష్టపరిహారం కూడా ఇచ్చారు. ఆ వివరాలు చెప్పింది పూర్వి.

"హరికి వచ్చిన డబ్బు, అతని తల్లిదండ్రులకు చెందాలి. అదే న్యాయం. అందుకే ఇలా వచ్చాను." అంది. రామ్మోహన్ చెప్పగా విని దుఃఖపడ్డారు గోపాలం, సావిత్రి. "వద్దు. మాకెందుకా డబ్బు? చెట్టంత కొడుకే పోయాక, ఆ డబ్బు మమ్మల్ని ఉద్ధరిస్తుందా?" అన్నారు.

మొట్టమొదటిసారి చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది పూర్వి.

"హరి ప్రతిక్షణం మీ గురించే తల్చుకునేవాడు. వాళ్ళని చాలా బాధపెట్టాను అని పశ్చాత్తాప పడేవాడు. ఇకనైనా వాళ్ళని సుఖపెట్టాలి అని ఆశపడేవాడు. అక్క దగ్గర దొంగిలించిన గొలుసు తిరిగి చేయించి ఇవ్వాలని తపన పడిపోయేవాడు. ఒక్కసారి నా వాళ్ళందర్నీ చూసుకోవాలని ఉంది. ఎప్పటికి ఆ అదృష్టం కలుగుతుందో నాకు. జీవితంలో కాస్త నిలదొక్కుకుని ప్రయోజకుడినై వాళ్ళ దగ్గరకు వెళ్ళాలి. నావంటి కొడుకుని కని నానా బాధలూ పడ్డ అమ్మానాన్న నన్ను చూసుకుని సంతోషపడాలి. అదే నా జీవితంలో ఒకే ఒక కోరిక అని కుమిలిపోయేవాడు.

ఇద్దరం కష్టపడి నాలుగు డబ్బులు కూడబెట్టుకుని మీ దగ్గరకు రావాలని అనుకొన్నాం. కాని దురదృష్టం. ఇలా జరిగిపోయింది. హరి ఎలాగూ రాలేదు. కనీసం ఈ డబ్బు మీకు అందితే తన ఆత్మకు శాంతి కలుగుతుంది. మీ పరిస్థితులు అన్నీ నాకు తెలుసు. మీరు ఎటువంటి జీవితం గడుపుతున్నారో హరి నాకు చెప్పాడు. కొడుకుగా పెద్దతనంలో మిమ్మల్ని ఆదుకోవడం హరి కర్తవ్యం. ఈ డబ్బు మీకు ఉపయోగపడితే...!" ఇక మాట్లాడలేకపోయింది పూర్వి.

అంతా చూస్తూ వున్న బలరామ్‌కి దుఃఖం ముంచుకొచ్చింది.

గోపాలం, సావిత్రి ఎటువంటి జీవనం సాగిస్తున్నారో అతనికి తెలుసు. పాతికేళ్ళనాడే ఉన్న ఇల్లు శిథిలం అయిపోతే, ఎవరో ఊరొదిలి పోతూ ఇంట్లో వుండి కాస్త దీపం పెట్టండి చాలు అని ఇచ్చిన ఇంట్లో నివాసం. ప్రభుత్వం మంజూరు చేసిన వృద్ధాప్య ఫించను. గుళ్ళో పౌరోహిత్యం. చెరో నాలుగు జతల బట్టలు. పెరట్లో కాసిన కూరలు వుంటే సరే, లేకపోతే పులగం, దద్దోజనం మహానైవేద్యం పెట్టి అదే ఆహారం. పావుశేరు పాలు కొనుక్కుంటారు. కబుర్లతోనే కావాల్సినంత కాలక్షేపం.

ఆః! మనకంటే దీనస్థితిలో వున్నవాళ్ళు దేశంలో కోకొల్లలు. మనకేం తక్కువ అనే మొండి ధైర్యంతో బతికేస్తున్నారు.

రామ్మోహన్ మాటకొస్తే కరెంటు పరికరాల రిపేరీ షాపు. చిన్న బస్తీలో కాపురం. అంతంత మాత్రపు ఆదాయం. ఒక కూతురు. సుధ కూడా జాకెట్లు కుట్టి నాలుగు రూపాయలు సంపాదిస్తుంది. కరువు రోజుల్లా గడ్డుగానే వుంది అతని జీవితం.

అటువంటి స్థితిలో రెండు లక్షలంటే మాటలు కాదు. కానీ ఆ డబ్బు ఎలా వచ్చింది? క్రిందటి రోజున ఆ అమ్మాయి వెతుక్కుంటూ వచ్చింది. రాగానే చనువుగా పలకరించింది. యోగక్షేమాలు అడిగింది. కొత్త వ్యక్తి – ఎన్నేళ్ళ నుండో పరిచయం వున్నట్టు ప్రవర్తిస్తూ వుంటే ఆశ్చర్యం వేసింది. గోపాలం గారింటికి తీసుకెళ్ళండి నన్ను. మీరు రేపొద్దునే వెళ్ళి సుధగారిని, భర్తనీ తీసుకురండి అని చేతులు జోడించి అడుగుతూ వుంటే పూర్వి రాక వెనుక ఏదో రహస్యం వుందని ఊహించాడుగాని ఇంత ఘోరం జరిగిందని అనుకోలేదు. నువ్వెవరో చెప్పు ముందు అని నిలదీసి అడిగితే అప్పుడు చెప్పింది.

ఇప్పుడు శ్రేయోభిలాషి అయిన తను మధ్యవర్తిత్వం వహించాలి. పెద్దవాళ్ళం మాకొద్దు. వాడి భార్యకి ఇంకా బోలెడంత జీవితం ముందు వుంది. పూర్వినే వాడుకోమంటున్నారు గోపాలం, సావిత్రి. సుధ, రామ్మోహన్ వాళ్ళనే బలపరుస్తున్నారు.

"హరికి నేనేం చేయలేదు. అతనే నాకు సాయం చేశాడు. అతని భార్యగా నాకు రావలసినవి వస్తాయి. ఈ డబ్బు మాత్రం మీకే చెందాలి. అప్పుడే హరి ఆత్మకు శాంతి" అంటుంది పూర్వి.

ఇరువైపులా మంచివాళ్ళే అయితే ఆ తగవు తీర్చడం మహాకష్టం. కానీ బలరామ్ ఆ పాత్రను సమర్థవంతంగా పోషించాడు. న్యాయం పూర్వి పక్షానే వుంది కాబట్టి ఆమెనే బలపరిచాడు. ఎదుటివారిని ఒప్పించాడు. సుధ రామ్మోహన్‌లకి ఒక లక్ష; సావిత్రి గోపాలాలకు ఒక లక్ష.

సుధ డబ్బు రూపంలోనే తీసుకుని పీకల మీద ఉన్న అప్పు తీర్చుకుంటాను అంది. గోపాలం పేరు మీద లక్ష రూపాయలు పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ వేశాడు బలరామ్.

అతను ఆ ఊరి పోస్ట్‌మాస్టర్ కాబట్టి ఆ పనులు సులువుగా చేసేశాడు.

వచ్చిన పని పూర్తయింది కాబట్టి మర్నాడే తిరుగు ప్రయాణమైంది పూర్వి. కోడల్ని తమ దగ్గరే వుంచుకుంటే బావుంటుందని సావిత్రి అనుకుందిగానీ గోపాలం ఒప్పుకోలేదు. ఈ వయసులో మనతో కలిసి వుంటే ఆ అమ్మాయికి భారమే తప్పించి ఏ మాత్రం సాయం కాదు. అదీగాక అలవాటైన ఊరూ, ఉద్యోగం అక్కడే వుంది. కాబట్టి అక్కడికి వెళ్ళిపోతేనే సుఖపడుతుంది అన్నాడు.

బాధతో కుమిలిపోతూనే కోడలి ప్రయాణానికి ఏర్పాట్లు చేసింది సావిత్రి. హరి చిన్నతనంలో వాడుకున్న సామాన్లు సంచీలో సర్ది ఇచ్చింది. దార్లో తినడానికి పూరీలు చేసి ఇచ్చింది.

స్టేషన్‌కి వెళ్ళారు అందరూ. ఇంకాసేపట్లో రైలు వస్తుంది.

"చూడమ్మా! నువ్వు మా కుటుంబంలోని వ్యక్తివే. హరి లేకపోయినా మేమంతా వున్నాం. నీ యోగక్షేమాలు బలరామ్‌కి తెలియజేస్తూ వుండు. నీకు ఎప్పుడు ఏ సాయం కావాల్సివచ్చినా కాకి చేత కబురు పంపితే వచ్చేస్తాం" అంటూ మామగారు, అత్తగారూ చెప్పిన మాటలని హిందీ చెప్పాడు బలరామ్.

రైలు వచ్చింది. అందరి పాదాలకి నమస్కారం చేసి రైలెక్కింది పూర్వి. సీట్లో కూర్చుంది. కళ్ళవెంట నీళ్ళు కారి బుగ్గలను తడిపేశాయి. హరి మరణంతో మండిపోతున్న మనసుకు సాంత్వన కలిగింది. హరి లేకపోయినా తను ఒంటరిది కాదు. తనకు అమ్మా నాన్నా, అక్కా, బావా, బలరామ్ మామయ్య వున్నారు. వాళ్ళంతా తనవాళ్ళు. తృప్తిగా కళ్ళు మూసుకుంది పూర్వి.

(*నవ్య వారపత్రిక, 28 జనవరి 2015*)

# బాలరాజు కథ

బాలరాజు గారి ఇల్లు ఆ ఏరియాకి అదో కొండ గుర్తు. బాలరాజు గారింటి దగ్గర ఆ పై సందు, బాలరాజు గారింటికి ఓ కిలోమీటరు దూరం మా ఇల్లు అని చెప్తుంటారు జనాలు.

నిజంగా అంత గొప్పదే ఆ ఇల్లు. గొప్ప గొప్ప భవంతులు అసంఖ్యాకంగా వున్న మహానగరంలో డబ్బున్న వారి అట్టహాసాలకేం లోటు లేదు. బాలరాజుగారిల్లు మాత్రం కాస్త భిన్నంగానే వుంటుంది. ఆరొందల గజాలుంటే నిలువుగా ఇల్లు కట్టుకునే ఈ రోజుల్లో పన్నెండొందల గజాల్లో నేలబారున కట్టుకున్నాడు బాలరాజుగారు.

మంచి ఆర్కిటెక్ట్ డిజైన్ చేశాడు. ఆ స్థలంలో నాలుగు మూలలా నలుగురు కొడుకులకీ ఇళ్ళు. మధ్యలో ఈయనకి ఒక చిన్న ఇల్లు. ఆశ్రమంలా వున్న ఆ ఇంట్లో భార్యా సమేతంగా వుంటున్నాడు. ఆయనకి అరవై దాటాయి. ఇటీవలే షష్టిపూర్తి జరుపుకున్నాడు.

ఇరవైఏళ్ళ వయసులో గల్ఫ్ కంట్రీస్‌కి వెళ్ళిపోయాడు. పెద్ద చదువులేం చదువుకోలేదు. కొన్నాళ్ళు అక్కడక్కడ చిన్న చిన్న ఉద్యోగాలు చేసినా తర్వాత స్వంతంగా ఓ రెస్టారెంట్ పెట్టుకున్నాడు. చాలా సంపాదించాడు. కుటుంబం మాత్రం ఇక్కడే వుండేది. నలుగురు కొడుకులు. ఏదో డిగ్రీ దాకా చదివించి ఇక్కడా ఫుడ్ జాయంట్ పెట్టించాడు వాళ్ళచేత. ఓపిక వున్నంత కాలం అక్కడే వుండి తర్వాత ఇండియా వచ్చేశాడు. అప్పటికి కొడుకులు నలుగురు కలసి రెండు చోట్ల స్వీట్ షాపులు నడుపుతున్నారు. బాలరాజు తిరిగొచ్చాక మరో రెండు చోట్ల కూడా షాపులు ప్రారంభించాడు. బాలక్రిష్ణా స్వీట్స్ అండ్ చాట్స్ అని అధునాతనంగా ఏర్పాటు చేశాడు. పాత షాపులూ రెనోవేట్ చేయించి నలుగురికీ నాలుగూ అప్పగించేశాడు. పర్యవేక్షణ మాత్రం తనదే. బావుంది, నలుగురూ వేగంగానే పుంజుకున్నారు. ఈ రోజుల్లో బతకనేర్చినతనం, నిజాయితీ వుండాలిగానీ ఫుడ్ బిజినెస్ అంత లాభసాటి వ్యాపారం మరొకటి లేదు. ఎవరికి తినిపించాల్సింది వారికి తినిపిస్తూ, కస్టమర్లకు కమ్మని పదార్థాలు తినిపిస్తే నూటికి నూరు శాతం లాభాలు వస్తాయి. అదంతా ఆకళింపు చేసుకున్నాడు బాలరాజు.

ఎన్నో కొత్త ఐటెమ్స్ ప్రవేశపెట్టాడు. వంటలో చెయ్యి తిరిగిన మనిషి. నిత్యం ప్రయోగాలు చేస్తూనే వుంటాడు. వాళ్ళ షాపుల్లో మాత్రమే దొరికే పదార్థాలు కొన్ని వున్నాయి. వాటి కోసం క్యూలు కడతారు జనం. ఫలితం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వుంది.

బిజినెస్ వ్యవహారాలు ఒక కొలిక్కి వచ్చాక ఎన్నాళ్ళుగానో కలలు కంటున్నట్టుగా ఇంటి నిర్మాణం మొదలుపెట్టాడు. ఏడాదిలోగానే పూర్తయింది. గృహ ప్రవేశం అయింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Poorvi**

* * *